క్లుప్తంగా

కారంపూడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

నరసరావుపేట ఈస్ట్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అనంతశివను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబు సెప్టెంబర్ 13వతేదీన పాఠశాలను సందర్శించిన సమయంలో హాజరు శాతం తక్కువగా ఉండటం, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించక పోవటం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వంటి అంశాలను గమనించారు. విధి నిర్వహణలో హెచ్‌ఎం అనంతశివ నిర్లక్ష్యంగా వ్యవహరించటం పట్ల కలెక్టర్ అరుణ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేయటంతో పాటు గురజాల డివిజన్ అభివృద్ధి అధికారిని విచారణాధికారిగా నియమించారు. అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎం అనంతశివను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు సమాచారం లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వదిలి వెళ్లరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశార

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పండరీపురం , ఎన్ఆర్‌టీ సెంటర్, సుగాలికాలనీ, చెరువు రోడ్డు, బ్యాంకు కాలనీ పరిసర ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రజలకు ఉపయోగకరమైన పనులను గుర్తించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. ఇందులో భాగంగా మొదట రోజు కనమర్లపూడి, శావల్యాపురం, బొందిలిపాలెం, మతుకుమల్లి, 3న ముండ్రువారిపాలెం, శానంపూడి, చినకంచర్ల, పిచికలపాలెం,4న గుంటుపాలెం, వయ్యకల్లు, కొత్తలూరు, కారుమంచి, 5న వేల్పూరు, ఇర్లపాడు, పోట్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభలు జరుగుతాయన్నారు.

వృద్ధ మహిళలకు చేయూత

చిలకలూరిపేట: వృద్ధులను గౌరవించి, ఆదరించాలని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒంటరి వృద్ధ మహిళలు 110 మందికి ఒక్కొక్కరికీ రూ. వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం, పండ్లు, స్వీట్ ప్యాకెట్లు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సరోజిని మాట్లాడుతూ అసిస్ట్ సంస్థ వృద్ధులు, మహిళల పట్ల చూపుతున్న ఆదరణ ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు, అసోసియేషట్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఉపాధ్యక్షురాలు జాష్టి ప్రమీల, సభ్యులు తియ్యగూర రమాదేవి, దండా రమాదేవి పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో వివిధ కేటగిరిల్లో పనిచేయుచున్న కార్మికులకు కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.మారుతివరప్రసాద్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ వర్కర్స్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులు వాటర్ వర్కర్స్, కరెంటు, డ్రైవర్స్, బోర్ వర్కర్స్, పారిశుద్ధ్య కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించి ఆమోదించిన కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

వినుకొండ (నూజెండ్ల): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా చేరి సమాజసేవలో భాగస్వామ్యులు కావాలని, సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వినుకొండ చైర్మన్ బెల్లంకొండ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్. హరిబాబు, ప్రోగ్రాం ఆఫీసర్ జి. అంజయ్య, కోఆర్డినేటర్ డాక్టర్ కేవీఎస్ కోటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు వీఆర్వోల నియామకం

శావల్యాపురం: మండలంలోని పలు గ్రామాల పరిధిలో వీఆర్వోలు బదిలీ అయినట్లు తహసీల్దారు వేముల వెంకట నాగరాజు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కలెక్టరు సారథ్యంలో నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తలూరు– నూతన వీఆర్వో ఉప్పలూరి చిన మంగయ్య, శానంపూడి వీఆర్వోగా మల్లెల రాధ, కనమర్లపూడి– కె. నరసింగరావు (నరసరావుపేట రూరల్ కాకాని) శావల్యాపురం–డి.రమాదేవి (నూజెండ్ల మండలం చింతలచెర్వు) మతుకుమల్లి– ఆదెయ్య (వినుకొండ పట్టణం ఎన్నెస్పీ వార్డు సచివాలయం) వేల్పూరు1– ఎస్‌కె. మౌలాలి పోట్లూరు–ఆర్ ప్రసన్నకుమారి, నూతనంగా నియామకం అయినట్లు తెలిపారు. పిచికలపాలెం గ్రామానికి చెందిన వీఆర్వో ఊయల అమల వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామానికి బదిలీ అయ్యారు. పిచికలపాలెం, గుంటుపాలెం గ్రామాలకు నూతన వీఆర్వోల నియామకం జరగలేదు.

బేరాలు లేక.. చక్రాలు కదలక..

- లారీ యజమానులకు ఇసుక దెబ్బ
- గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి
- రోజుకు రూ.2500 నుంచి రూ.3 వేల వరకు నష్టపోతున్న యజమానులు
- ఇసుక దొరక్క ఇతర రాష్ట్రాలకు వలసపోతున్న కార్మికులు
- ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలని వ్యాపారుల వినతి
- ఇసుక ఫ్రీ విధానం వల్ల పెరిగిన ధరలు



సత్తెనపల్లిరోడ్డులో ఇసుక సప్లయి ఆఫీసు వద్ద ఖాళీగా పార్కింగ్ చేసి ఉంచిన లారీలు



సత్తెనపల్లిరోడ్డులోని లారీ ఆఫీసు వద్ద ఇసుకను ట్రాక్టర్‌లో లోడు చేస్తున్న దృశ్యం



సత్తెనపల్లిరోడ్డులోని ఇసుక సప్లయి లారీ ఆఫీసులో కూర్చొని ఉన్న యజమానులు

నరసరావుపేట: గత ఐదు నెలలుగా ఎవరికీ ఇసుక సక్రమంగా లభించటం లేదు. ఆ ఇసుకను రవాణా చేసే లారీ యజమానులకు బేరాలు లేవు. అప్పులతో లారీలను కొన్న యజమానుల బాధలు వర్ణనాతీతం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు కావస్తోంది. గత ప్రభుత్వ పాలసీని రద్దుచేసి ఇసుక ఫ్రీ పేరుతో ఆన్‌లైన్ విధానం అమలు చేస్తోంది. దీంతో గత ప్రభుత్వంలో మాదిరిగా ఇసుక సులభంగా తక్కువ ధరకు లభించట్లేదు. దీంతో ఇసుక దొరక్క వినియోగదారులు, ఆ ఇసుకను రవాణా చేసే లారీ యజమానులకు బాడుగలు లేక వారు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

వరదలొచ్చి... తిప్పలొచ్చి...

మరీ ముఖ్యంగా వరదలు వచ్చిన గత నెలలో జులుగా ఇసుక బంగారమైంది. సుమారు 150 కిలోమీటర్ల దూరంలోని ఏ ఇసుక ర్యాంపులోను ఇసుక లభ్యం కావట్లేదు. లారీ యజమానులు విజయవాడ, నెల్లూరు, అమరావతి తదితర ప్రాంతాల నుంచి తీసుకురావాలన్నా గగనమైపోయింది. గత ప్రభుత్వంలో టన్నుకు రేటు కట్టి పారదర్శకంగా వ్యవహరించి రూ.670లు చెల్లిస్తే ఇంటివరకు సరఫరా చేసిన ఇసుక నేడు టన్ను రూ.2 వేలు చెల్లించాల్సి వస్తుంది. ఆ ధర భరించి ఇసుక కావాలన్నా లభించే పరిస్థితి కన్పించటంలేదు. దీంతో చాలా మంది యజమానులు నిర్మాణాలను ఆపేశారు. వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులకు పనిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఐదు నెలలుగా ఉపాధి కరువు

ఒక్క నరసరావుపేట నియోజకవర్గంలోనె 100 మంది యజమానులు 150 లారీలను ఇసుక సరఫరాకు వినియోగిస్తున్నారు. వీరి వద్ద 500 మంది కార్మికులు ప్రతిరోజూ పనిచేసే వారు. గత ఐదు నెలలుగా వీరి వాహనాలకు పని దొరకటంలేదు. అవి మొత్తం ఖాళీగా పార్కింగ్ చేసి ఉంటున్నాయి. ప్రతి లారీకి నెలకు కిస్తీతో పాటు డ్రైవర్ల జీతాలు, రిపేర్లతో రూ.1 లక్ష ఖర్చు కన్పిస్తుంది. వాటిని చెల్లించే వెసులుబాటు లభించక యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఫ్రీ ఇసుక పాలసీ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక కోసం రిజిస్టర్ చేసుకుందామంటే ఆ వెబ్‌సైటు అర్ధరాత్రి తెరువబడి కొన్ని నిమిషాలు మాత్రమే పనిచేస్తుందని లారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ ఎవరో ఒకరికి చాన్స్ లభించినా ఇసుక కోసం వెళితే బండి తిరిగి ఎప్పుడు వస్తుందో కూడా చెప్పలేమంటున్నారు.

మార్పులు తీసుకురావాలి



ఐదు నెలల నుంచి ఇసుకను ఆపేసి కోట్ల మంది ప్రజల్ని అప్పులు పాలు చేస్తున్నారు. ఆన్‌లైన్ విధానం విడనాడాలి. ప్రభుత్వం మైనింగ్ విభాగం ద్వారా అధికారుల పర్యవేక్షణలో నియోజకవర్గానికి నాలుగు రాంపులు ఏర్పాటు చేయాలి. ట్రెజరీలో స్కానర్ ద్వారా డబ్బులు కట్టించుకుని లోడింగ్ చేయాలి. అప్పుడే సులభంగా ఇసుక లారీల ద్వారా వినియోగదారులకు లభిస్తుంది. టిప్పర్‌కే లోడు చేస్తామనకుండా ప్రతి లారీకి ఇసుక లోడు చేయాలి. అప్పుడే లారీ యజమానులకు ఉపయోగకరంగా ఉంటుంది.

–గురు అంజనేయులు, ఇసుక లారీల యజమాని, నరసరావుపేట

మూడు వారాలుగా పని నిలిపివేశా



నేను ఇంటి నిర్మాణం చేపట్టా. ముందుగానే పరిస్థితి గ్రహించి ఇసుకను ఎక్కువగా దిగుమతి చేయించుకున్నా. ఇంటి నిర్మాణం పూర్తికావొచ్చింది. బండ పరువు సమయానికి ఇసుక కావల్సి వచ్చింది. ఫ్రీగా, తక్కువ ధరకు దొరుకుతుందని మూడు వారాలుగా ఎదురు చూస్తున్నా. ఇప్పుడు టన్ను రూ.2 వేలు చెల్లించి ట్రాక్టర్ ద్వారా మారు బేరగాళ్ల వద్ద నుంచి తీసుకెళుతున్నా. ఇంతటి ధరను నేనెప్పుడూ చూడలేదు.

–హనుమంతరావు, బరంపేట, నరసరావుపేట

కె.జి.బి.వి.లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కె.జి.బి.వి)లలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద (కాంట్రాక్ట్) ప్రాతిపదికన 2024–25 విద్యాసంవత్సరానికి భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బోధనేతర సిబ్బందిని పొరుగు సేవలు (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన నియమించనున్నట్లు వివరించారు. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో 30 ఖాళీలు ఉన్నట్టు తెలిపారు. అభ్యర్థులు httpr://apkf bv.a pc-f-rr.in/ వెబ్‌సైట్ ద్వారా రూ.250లు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ఎన్ఈసీలో రక్తదాన శిబిరం



నరసరావుపేట రూరల్: విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు తెలిపారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పల్నాడు బ్లడ్ బ్యాంక్ సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో 120 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ మానవ రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి సేవ చేసినట్టు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఐ.శ్రీధర్, వలంటీర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంపై అవగాహన ఏర్పరచుకోండి



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వైద్యాధికారి

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక సారథ్యంలో మండల స్థాయిలో చెకుముకి పోటీలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు వాటి వలన జరుగు అనర్థాలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. మండల స్థాయి చెకుముకి పోటీల్లో శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.జ్యోతిర్మయి, ఈవీఎల్ ప్రసన్న, ఎస్. భవ్యశ్రీలు, ద్వితీయ స్థానం పోట్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.రూపశ్రీ,పి. అక్షయ్ కుమార్, యం.యమున, విజయం సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల టీం సభ్యులు ఈనెల 27న జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ సభ్యులు బోయపాటి తివిక్రమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా జనవిజ్ఞాన వేదిక కోశాధికారి సంద్రపాటి చలపతిరావు, మండల అధ్యక్షులు ఎ.వసంతరావు, ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి, ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు కేబీఆర్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: కేబీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి డి.ఉదయ్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్టు విద్యాసంస్థల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం పెనుమాకలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అండర్–17 జావలిన్‌త్రో విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థి ఉదయ్‌ను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.వెంకటశివ, పిడి ఎం.వినీల్, అభినందించారు.

■ **మండలస్థాయి చెకుముకి పోటీలు**

నరసరావుపేట ఈస్ట్: గాంధీ జయంతిని పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా మండల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపిచంద్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

■ **వక్తృత్వ పోటీలలో హేమలతకు ప్రథమ స్థానం**

రొంపిచర్ల : మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో కెజిబివి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఓ.హేమలత ఇటీవల స్వర్ణాంధ్ర – 2047 పోటీలలో భాగంగా జరిగిన పల్నాడు జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ పి.ఎల్. బాలశౌరీలు తెలిపారు.

■ **ఖోఖో పోటీలకు రొంపిచర్ల విద్యార్థిని**

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.శ్రీలక్ష్మీ అండర్–14 విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు బియం. సుభాని మంగళవారం తెలిపారు. కారంపూడి లోగల బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14 విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుచున్న విద్యార్థిని శ్రీలక్ష్మీ ఎంపికయ్యారన్నారు. నవంబర్ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున ఆడతారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో ఎంపికైన శ్రీలక్ష్మీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియం. సుభాని, విద్యా కమిటీ చైర్మన్ యిట్టె ఏడుకొండలు, వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

■ **బాస్కెట్ బాల్ జట్టుకు గుడ్‌షఫర్డ్ విద్యార్థులు**

వినుకొండ(నూజెండ్ల): చిలకలూరిపేటలో గత నెల 28వ తేదీన ఏఎంజీ స్కూల్లోనిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా బాస్కెట్ బాల్ అండర్ –14,17, అండర్ –19 సెలెక్షన్స్‌లో గుడ్‌షపర్డ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసునీత తెలిపారు. అదేవిధంగా 30వ తేదీన నరసరావుపేట మున్సిపల్ బాలికల పాఠశాలలో నిర్వహించిన గుంటూరు జిల్లా బాలికల జట్టు సెలక్షన్స్‌లో పాల్గొని ముగ్గురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంకయ్యారని తెలిపారు. అఖిల్, మనోహర్, పవన్, యోగేశ్వరరావు, పవిత్ర, జోషిత, హాని, భార్గవి, తేజేస్వినిలు ఎంపికై నట్లు తెలిపారు. జట్టుకు ఎంపికైన 9మంది క్రీడాకారుల ను పాఠశాల ఆవరణలో పలువురుఅభినందించారు.

■ **చెకుముకి టాలెంట్‌టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ**

నాదెండ్ల: జనవిజ్ఞాన వేదిక, చిలకలూరిపేట శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్ నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విడివిడిగా పోటీలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాల్లో గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. 8,9,10 తరగతులు చదువుతున్న బి రమ్యశ్రీ, కె లావణ్య, సీహెచ్ సాత్విక ప్రథమ స్థానాల్లో నిలిచారు.

■ **యడ్లపాడులో...**

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించగా, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఫరియానా, కత్రిప్రియ, కారసాల మెర్సీ విజయం సాధించారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో నారాయణ స్కూలు విద్యార్థులకు షౌకత్, శ్రీసాహితి, హేమ అభయశ్రీ గెలుపొందారు.

■ **సత్తా చాటిన నిర్మల ఇంగ్లిష్ మీడియం విద్యార్థి**

వినుకొండ(నూజెండ్ల): ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ అండర్ –17 విభాగంలో నిర్మల ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి బి. హర్ష గోల్డ్ మెడల్ సాధించాడని సిస్టర్ సెలీన్ తెలిపారు. సెప్టెంబరు 30న పెనుమాకలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ –17 విభాగంగా 100, 200 మీటర్ల పరుగు పందెంలో బి. హర్ష గోల్డ్ మెడల్ సాధించాడని వివరించారు.

■ **విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్**

బొల్లాపల్లి : మండల కేంద్రంలోని బండ్లమోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం కె.అపర్ణ తెలిపారు. ఈ పోటీల్లో వెల్లటూరు, బండ్లమోటు జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని హెచ్‌ఎం వెల్లడించారు. గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌ఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట: గాంధీ జయంతిని పురస్కరించుకొని గుంటూరురోడ్డులోని కొండవీడు ఇయన్‌టీ హాస్పిటల్‌లో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎం.డీ, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు చెవి, ముక్కు, గొంతులపై వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తామన్నారు. అవసరమైన వారికి చెవిటి మెషీన్ 30శాతం రాయితీపై ఇవ్వబడుతుందన్నారు.

వేర్వేరు గ్రామాల్లో ఎమ్మెల్యే జీవీ పర్యటన



బొల్లాపల్లి : మండలంలోని రేమిడిచర్ల, పేరూరుపాడు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రేమిడిచర్లలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. అనంతరం పేరూరుపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేత ఎస్. శ్రీనివాసరావు, ఏడీఏ బి.రవిబాబు, తహసీల్దార్ ఎ.వి.సుధాకర్, ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్, ఎంపీడీవో షేక్ గౌసియాబేగం, ఏవో ఎ.అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కృష్ణవేణి ఫ్రెషర్స్ డే



ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కృష్ణవేణి యాజమాన్యం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు భవిష్యత్ అవసరాలకు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వక్తలు తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను మంగళవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు కె.నాసరయ్య, కె.వీరరాఘవులు, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ, విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా బాటలు వేస్తూ వారి అభ్యున్నతికి కళాశాల యాజమాన్యం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకవచ్చేలా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని హితవు పలికారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఫలితాలు, క్రీడలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. వేడుకల్లో భాగంగా సినీ యాంకర్, గాయకులు స్నిగ్ధ, ఉదయ్, అను, విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్ష



నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రవేటీకరించటం విరమించుకోవాలని కోరుతూ విద్యార్థి, యువజన, రైతు కార్మిక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా మంగళవారం గాంధీపార్క్ వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహమంటూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలనీ, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలి రోజు దీక్షలో విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు డి.శివ కుమారి, షేక్.సిలార్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఆగదు




నరసరావుపేట: రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒకటో తారీకున తెల్లవారకముందు అవతాతల ఇళ్ళకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గంలో పలుచోట్ల పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సహాయం



రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో గత విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేసి అనంతరం నీట్ పరీక్ష వ్రాసి ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన విద్యార్థిని రుద్రపాటి శ్రీనిధికి మంగళవారం పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ మాట్లాడుతూ తమ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్య చదివిన విద్యార్థినీ శ్రీ నిధి ఎంబీబీఎస్‌లో సీటు సాధించటం అభినందనీయమన్నారు. తమ కాలేజీ చరిత్రలో స్థిర స్థాయిగా నిలిచిపోతుందన్నారు. వైద్యవిద్య నభ్యసిస్తున్న శ్రీ నిధికి పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు ఆర్థిక సహాయం అందజేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం వారు వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని శ్రీ నిధికి రూ.50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిద్దె తోటల పెంపకందారులకు మొక్కలు పంపిణీ



నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంలో మహిళలు పంటలే కాకుండా మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తారని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కే.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని కాకతీయనగర్ 1వ లైన్‌లో పండ్ల మొక్కలు పంపిణీ మంగళవారం నిర్వహించారు. కాలనీవాసులకు సీతాఫలం, దానిమ్మ, జామ, ద్రాక్ష, థాయలాండ్ మ్యాంగో, రెడ్ బనానా, పనస, యాపిల్, బేర్, నేరేడు, స్టార్ ఫ్రూట్ స్విట్‌తో పలు రకాల 200 మొక్కలను పంపిణీ చేశారు.